ఆర్‌బీకేలు రైతు నేస్తాలు

- అన్నదాతలకు ప్రభుత్వ ప్రోత్సాహం
- విత్తనం నుంచి విక్రయం వరకూ సహకారం



జి.అగ్రహారం రైతు భరోసా కేంద్రం

అమలాపురం రూరల్: ఒకప్పుడు వ్యవసాయ చేయాలంటే ప్రతి పనికి మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. రోజుల తరబడి తిరిగినా ఆయా పనులు పూర్తయ్యేవి కావు. గత టీడీపీ హయాంలో అన్నదాతకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేక రైతులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యేవారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో రైతుల కష్టాలను దగ్గరగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే రైతు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారు. రైతు భరోసా కేంద్రాలను రైతులకు చేరువ చేసి గ్రామాల్లోనే విత్తనం నుంచి విక్రయం వరకూ సమస్త సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

అడుగడుగునా సహకారం

రైతు భరోసా కేంద్రాల్లో ఈ-పంట ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పండించిన పంటకు గిట్టుబాటు ,ధరలను పక్కాగా అమలుచేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ-పంట నమోదు, రైతు భరోసా, పీఎం కిసాన్, సున్నా వడ్డీ రాయితీ, వైఎస్సార్ యంత్ర సేవా పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ, ఎరువులు, విత్తనాలు, మట్టి నమూనా పరీక్షలు తదితర సేవలను అందిస్తున్నారు. రైతులకు అడుగడుగునా సహకారాన్ని అందిస్తూ అధిక దిగుబడులు సాధించే దిశగా ప్రోత్సహిస్తున్నారు. నారు వేసిన నాటి నుంచి పంట చేతికి వచ్చేంత వరకూ రైతులకు అండదండగా నిలుస్తున్నారు. అమలాపురం రూరల్ మండల పరిధిలోని 22 గ్రామాల్లో 27 ఆర్‌బీకేలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది సుమారు 5 వేల మంది రైతులు 7,200 ఎకరాల విస్తీర్ణంలో వరి, సుమారు 1050 వేల మంది రైతులు 1500 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.

అదే సీజన్‌లో పరిహారం

గత ప్రభుత్వ హయాంలో తుఫాన్లు, భారీ వర్షాలకు పంటలు నష్టపోతే సర్వేకు మాత్రమే పరిమితమయ్యేవారు. ఎప్పుడైనా పరిహారం ఇచ్చినా కంటి తుడుపుగానే అరకొరగా కానిచ్చేసేవారు. అది కూడా పంట నష్టం జరిగిన రెండు, మూడేళ్లకు అందేవి. కాని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఖరీఫ్, రబీ సీజన్‌లకు ముందే పంట పెట్టుబడి కింద రైతు భరోసా, ఏ సీజన్‌లో పంట నష్టానికి ఆ సీజన్‌లోనే పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పథకం సాయం అందచేస్తూ రైతులను ఆదుకుంటున్నారు.

అమలాపురం మండలంలో గత నాలుగేళ్లుగా రైతులకు కలిగిన లబ్ధి

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	14,676	19.50
వైఎస్సార్ పంటల బీమా	1,384	1.66
వైఎస్సార్ ఇన్‌పుట్ సబ్సిడీ	3,545	2.83
కౌలు రైతు కార్డులు	152	0.78
మొత్తం	19,757	24.77

రైతులకు అందుబాటులో సేవలు



గతంలో మండలానికి ఒక వ్యవసాయ అధికారి, వారికి ఇద్దరు సహాయకులు ఉండేవారు. పైగా ప్రతి పనికి మండల కేంద్రంలో ఉన్న అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామాల్లోనే ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి సకల సేవలను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆర్‌బీకేల్లో వీఏఏ, ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను నియమించి సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

– సలాది శ్రీనివాస్ చక్రవర్తి, చైర్మన్, మండల వ్యవసాయ సలహా మండలి, అమలాపురం రూరల్ మండలం

ధైర్యంగా సాగు చేస్తున్నాం



నేను 4 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. గతంలో వ్యవసాయ అవసరాలు నిమిత్తం మండల కేంద్రం అమలాపురం వెళ్లాల్సి వచ్చేది. అప్పట్లో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేశాక రైతుల కష్టాలు తీరిపోయాయి. విత్తనం నుంచి విక్రయం వరకూ సకల సేవలు ఆర్‌బీకేల ద్వారా అందుతున్నాయి. అందుకే రైతులందరూ ధైర్యంగా సాగు చేసుకుంటున్నాం.

– రమణాతి లక్ష్మణమూర్తి, రైతు, నల్లమిల్లి

జీజీఎంపీ నిధులతో గ్రామాభివృద్ధి

- మంత్రి తనయుడు పినిపే శ్రీకాంత్
- కొమరగిరిపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం



కొమరగిరిపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీకాంత్ తదితరులు

అల్లవరం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధికి రూ. 20 లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్ అన్నారు. కొమరగిరిపట్నంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే అమలు కావాలంటే వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఆ దిశగా ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీ గెలుపుకి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి చక్కని అవకాశమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, సొసైటీ చైర్మన్లు గుర్రం బాబులు, అల్లూరి సురేష్‌రాజు, నోడల్ అధికారి కృష్ణమోహన్, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మెరికల శ్రీను, కడలి లక్ష్మణరావు, కొనుకు బాబురావు, కుడుపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



ముమ్మిడివరం నగర పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- నగర పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం

ముమ్మిడివరం: అర్హులందరికీ ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవేస్తుండడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 1, 19 వార్డుల్లో కాశివాని తూము నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగనన్నను రానున్న ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో 98 శాతం పైగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, వాసంశెట్టి ఫణి, దొమ్మేటి అప్పారావు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రోగులకు పింఛన్ల పంపిణీ





కాకినాడ ఆసుపత్రిలో దీనమ్మకు, నర్సాపురంలో చంద్రకాంతమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్లు

రాజోలు/మలికిపురం: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స కోసం నర్సాపురం వెళ్లిన మెరకపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు యెలుమర్తి చంద్రకాంతమ్మకు వలంటీర్ యెలుమర్తి నవీన్‌కుమార్ నర్సాపురం వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. అలాగే మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన వృద్ధురాలు కందికట్ల దీనమ్మ అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. దీంతో వలంటీర్ సాయినాథ్ కాకినాడ వెళ్లి ఆమెకు పింఛన్ అందించాడు. వలంటీర్లను ఆయా గ్రామాల అధికారులు అభినందించారు.

పాఠశాలలకు క్రీడాసామగ్రి అందజేత



పాఠశాలలకు మంజూరైన క్రీడాసామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: ప్రభుత్వం పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న క్రీడా సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం గోపాలపురంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 54 పాఠశాలలకు, హైస్కూళ్లకు మంజూరైన కిట్లను జగ్గిరెడ్డి చేతుల మీదుగా హెచ్‌ఎంలు, విద్యార్థులకు అందజేశారు. ఎంఈఓ-2 బైర్రాజు శ్రీనివాసరాజు, సీఆర్పీ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన 17 రకాల ఆట వస్తువులతో కూడిన క్రీడాసామగ్రిని పాఠశాలలకు జగ్గిరెడ్డి అందించారు.

సురక్షిత తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ

ఆలమూరు: సురక్షిత తాగునీటిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతి ఇంటికీ కుళాయిని ఏర్పాటు చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని చెముడులంక రూ.37.7 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్‌కు మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గ వ్యాప్తంగా రూ.26.2 కోట్లతో జల్‌జీవన్ మిషన్ కింద అనేక వాటర్ ట్యాంకులు నిర్మించి పైప్‌లైన్లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే రూ.కోట్ల వ్యయంతో గ్రామంలో ఎంతో కాలంగా ఉన్న ప్రధాన మేజర్ డ్రైన్ నిర్మించుకోవడం జరిగిందన్నారు. అలాగే రికార్డు స్థాయిలో సీసీ రోడ్లు, గ్రామ సచివాలయాలు, ఆర్బీకే, తదితర భవనాలు నిర్మిస్తున్నామన్నారు. వాటర్ ట్యాంకు నిర్మాణం తరువాత గ్రామంలోని సుమారు 1200 కుటుంబాలకు రూ.54 లక్షలతో ఇంటింటికీ పైప్‌లైన్ వేసి కుళాయిల ద్వారా తాగునీటిని అందించేందుకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, దొండపాటి చంటి, అడబాల వీర్రాజు, తమ్మన హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి

అంబాజీపేట: అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న చిన్నారుల వివరాలను సేకరించి అంగన్‌వాడీకి వచ్చేలా వారి సంఖ్య పెంచాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ముక్కామలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ వెంకటేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో కేవలం ముగ్గురు విద్యార్థులు ఉండటంతో అంగన్‌వాడీ టీచర్‌ను, ఆయాను ఆరా తీయగా పొంతన లేని సమాధానం చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు అశుభ్రంగా ఉండటం గుర్తించి సత్వరమే శుభ్రం చేయించాలని సూచించారు. అంతకుముందు హాజరు పట్టీ, స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించారు.

ఆరోగ్య సురక్షతో నాణ్యమైన వైద్యం



చినగాడవిల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు



తుమ్మలపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



మురమళ్ల సచివాలయం వద్ద రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు బూరెల వెంకట్రాజు

అల్లవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందుతుందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. తుమ్మలపల్లి సచివాలయంలో సర్పంచ్ వడ్డి సుభాషిణి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సుమ, బాలసుబ్రహ్మణ్యం 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే మెరుగైన వైద్యం

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని చినగాడవిల్లి-పెదగాడవిల్లి సచివాలయ పరిధిలో సర్పంచ్‌లు బద్రి బాబ్జి, గుద్దటి మహాలక్ష్మిల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌లు బద్రి బాబ్జి, గుద్దటి మహాలక్ష్మిలు కోరారు. కార్యక్రమంలో గుద్దటి నాగరాజు, బద్రి వెంకటేశ్వరరావు, ఆకుల స్వామినాయుడు, తహసీల్దార్ జె.వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ కేఎస్ గౌరీకుమారి తదితరులు పాల్గొన్నారు.

చొల్లంగిలో 500 మందికి వైద్య పరీక్షలు

తాళ్లరేవు: మండలంలోని చొల్లంగి పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బూరెల వెంకట్రాజు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేశారు. గాడిమొగ, తాళ్లరేవు పీహెచ్‌సీల వైద్యులు ఎస్.శ్యామల, ఎల్.సురేష్‌కుమార్‌లతో పాటు జనరల్ మెడిసన్ ఆర్.మాధురి, పిల్లల వైద్యుడు ఎం.వెంకటేశ్వర్లు, నేత్ర వైద్య నిపుణుడు సత్తిబాబు, గైనకాలజిస్ట్ శ్రావణి బృందం రోగులను పరీక్షించారు. అనంతరం రోగులకు బూరెల వెంకట్రాజు చేతుల మీదుగా ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శివాజీ గణేష్, మాసా శ్రీనివాస్, స్వర్ణ రాజు, కేబుల్ శ్రీనివాస్, వారా సూర్యకుమారి పాల్గొన్నారు.

సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ఐ.పోలవరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి అన్నారు. మంగళవారం మురమళ్ల సచివాలయం-2 పరిధిలో సర్పంచ్ కాశే రాజుబాబు, ఎంపీడీఓ డి.రాంబాబుల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు టి.ఆదిత్య పవన్, శివగాయత్రి, ఎం.రామానుజరావు, వినయ్‌కుమార్, కెజియాలు 471 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

అమలాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రభుత్వం పేదలకు భరోసా కల్పిస్తుందని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ అన్నారు. మంగళవారం జనుపల్లి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. శిబిరంలో 524 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ గానాల భారతి, రెడ్డి శిరీష, ఆర్‌ఐ బాల సరస్వతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోంగార్డు ధర్మకృష్ణ సేవలు అభినందనీయం



ధర్మకృష్ణ దంపతులను సత్కరిస్తున్న ఎస్‌ఐ పరదేశి తదితరులు

అమలాపురం రూరల్: హోంగార్డుగా 33 ఏళ్ళ పాటు యల్లమిల్లి ధర్మకృష్ణ అందించిన సేవలు అభినందనీయమని తాలూకా ఎస్‌ఐ అందే పరదేశి అన్నారు. హోంగార్డు ధర్మకృష్ణ పదవీ విరమణ సందర్భంగా అమలాపురం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. హోంగార్డు ధర్మకృష్ణ దంపతులను రూరల్ సీఐ వీరబాబు, ఎస్‌ఐ అందే పరదేశి, ఏఎస్‌లు ఏడుకొండలు, గోపాలకృష్ణ తదితరులు సత్కరించారు.

జగనన్నకు వందనం



కేక్ కట్ చేసి జగనన్నకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ముమ్మిడివరం: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి సచివాలయ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మంగళవారం జగనన్నకు వందనం కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు పూర్తి స్థాయి డీడీఓ అధికారాలు కల్పిస్తూ ఫైల్‌పై సీఎం సంతకం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో జగనన్నకు వందనం కార్యక్రమం వారం పాటు నిర్వహిస్తామని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.ధనశేఖర్ తెలిపారు.

గ్యాస్ రాయితీ కోసం వివరాలు నమోదు చేయండి

యానాం: నియోజకవర్గ పరిధిలోని గ్యాస్ వినియోగదారులు పుదుచ్చేరి ప్రభుత్వం ప్రకటించిన ఎల్పీజీ గ్యాస్ సిలెండర్ రాయితీ పథకం కోసం తమ వివరాలను ఆన్‌లైన్‌లో లేదా ఫోన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సివిల్ సప్లయిస్ శాఖ డైరెక్టర్ సత్యమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎరుపు రంగు రేషన్‌కార్డుకు రూ.300, పసుపు రంగు రేషన్‌కార్డుకి రూ.150 చొప్పున లబ్ధిదారులకు రాయితీ ఇవ్వనున్నట్లు సీఎం రంగసామి ప్రకటించారన్నారు. వినియోగదారులు తమ గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగదారుని సంఖ్య, రిజిస్టర్డ్ మొబైల్ నెంబరు, రేషన్‌కార్డు, ఆధార్‌సంఖ్యలను వెంటనే నమోదు చేయాలని కోరారు.

యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా వూటుకూరి



వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలో సంఘం జాతీయ మహాసభలో నూతన కార్యవర్గంగా ఎన్నుకున్నామని సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు మంగళవారం తెలిపారు. జాతీయ కార్యవర్గ సభ్యులుగా బండారులంకకు చెందిన ప్రముఖ కార్టూనిస్టు మూడా రాముని ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

ప్రజాస్వామ్య విలువలకు విఘాతం

అమలాపురం టౌన్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మానవ హక్కుల వేదిక కార్యకర్తల ఇళ్లల్లో నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) సోదాలు నిర్వహించడం ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించడమేనని వేదిక రాష్ట్ర నాయకుడు ఎ.రవి, జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్, ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్‌లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయం కోసం పోరాడే వ్యక్తుల ఇళ్లపై సోదాలంటే ప్రశ్నించే గొంతుకల్ని అణచివేయడమేనన్నారు.

శిథిలస్థితిలో విద్యుత్ స్తంభం



తోటవారి వీధిలో శిథిలస్థితిలో ఉన్న విద్యుత్ స్తంభం

యానాం: యానాం పట్టణపరిధిలోని తోటవారివీధిలో విద్యుత్ స్తంభం శిథిలస్థితికి చేరుకోవడంతో స్థానికులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభం ఏ క్షణంలోనైనా కూలిపోవొచ్చని, విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వెంటనే శిథిల స్తంభం స్థానంలో కొత్తది వేయాలంటూ కోరారు.

చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ హర్షణీయం

మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి



మహిళా రిజర్వేషన్లపై హర్షం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించడం హర్షణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక సంస్థ(మెప్మా) టౌన్ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన డ్వాక్రా మహిళల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లును ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, అందుకు రాష్ట్రం నుంచి సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎంపీలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మహిళా సమాఖ్య ప్రతినిధులు, టౌన్, స్లమ్ లెవెల్ ఫెడరేషన్ల సభ్యులు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

వైభవంగా పితృ దేవతా పూజా మహోత్సవాలు



పితృ దేవతలకు పూజలు చేస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక ఆదిశేష నిలయంలో షోడశ రాత్రి పితృ దేవతా పూజా మహోత్సవాలు గత ఆరు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. రెండు వారాల పాటు జరిగే ఈ పూజోత్సవాలకు పట్టణానికి చెందిన దివంగత రవణం నాగభూషణం కుటుంబ సభ్యులు రూ.35 వేల విలువైన కొబ్బరికాయలు, సలాది దొరయ్యనాయుడు రూ.25 వేల విలువైన కురిడీ కొబ్బరి, సూదా సూర్యనారాయణమూర్తి కుటుంబసభ్యులు రూ.31 వేల విలువైన నువ్వులు, హవన సామగ్రి, భీమవరానికి చెందిన పెరుమాళ్ల శ్రీనివాస్ రూ.10 వేల విలువైన నువ్వుల నూనె సమకూర్చారు. అక్షయ పాత్ర వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు ఆధ్వర్యంలో పూజా క్రతువులు జరుగుతున్నాయి.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వాకర్స్ డిప్యూటీ గవర్నర్ నాగేశ్వరరావు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన వాకర్స్ డిప్యూటీ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు తన తల్లి యర్రమ్మ సంస్మరణ సందర్భంగా స్థానిక బ్యాంక్ కాలనీ వెనక ఉంటున్న పేదలకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, వాకర్స్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, తేతల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ డే నిరసన

అమలాపురం టౌన్: ఏడాది క్రితం నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని లఖింపూర్‌లో పోరాటం చేస్తున్న రైతులపై దాడిని ఖండిస్తూ అమలాపురం రైతు సమన్వయ కమిటీ సభ్యులు మంగళవారం నిరసన తెలిపారు. అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య ఈ ఘటనపై బ్లాక్ డే ప్రకటించడంతో స్థానిక గడియారం స్తంభం సెంటరులో రైతు కమిటీల నాయకులు కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. రైతు సంఘాల సమన్వయ సమితి నాయకుడు డేగా ప్రసాద్, కోనసీమ సమితి అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం, కన్వీనర్ కె.సత్తిబాబు, కో కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అయినవిల్లిలో జగనన్నకు చెబుదాం వాయిదా

అమలాపురం రూరల్: అయినవిల్లి మండలంలో బుధవారం జరగవలసిన జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు కలెక్టరేట్ కార్యాలయ వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ 6 తేదీన రాయవరం మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

మారు మూల ప్రాంతాల్లో పక్కా రహదారులు

మామిడికుదురు: మారు మూల ప్రాంతాల్లోనూ పక్కా రహదారులు నిర్మించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. లూటుకుర్రు శివారు బాడిలంక కరకట్టపై రూ.10 లక్షల జెడ్పీ నిధులతో నిర్మించనున్న గ్రావెల్ రోడ్డుతో పాటు, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న షెడ్డుకు, గడప గడపకు నిధులు రూ.18 లక్షలతో వివిధ ప్రాంతాల్లో నిర్మించనున్న రోడ్లకు ఎమ్మెల్యే చిట్టిబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు నిధులతో సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. జెడ్పీటీసీ కొరెడ్డి అంజిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ నేతలు అడబాల చక్రపాణి, పాలూరి పాండురంగారావు, అప్పన రామారావు పాల్గొన్నారు.